క్లుప్తంగా

ఉద్యోగులకు గ్రీవెన్స్ సెల్



ఉద్యోగుల సమస్యలు వింటున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే నిమిత్తం ప్రతి మూడో శుక్రవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



విజయనగరంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ కిట్లు అందజేస్తున్న పీడీ శాంతకుమారి

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం కింద గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌లో భాగంగా అందిస్తున్న పౌష్టికాహార కిట్ల పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. సచివాలయం సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తొలిరోజు 5,433 మంది లబ్ధిదారులకు కిట్లు అందజేశారు. ఒక్కో కిట్‌లో రాగి పిండి రెండు కిలోలు, అటుకలు ఒక కిలో, ఎండు కర్జూరం పావుకిలో, బెల్లం పావుకిలో, శనగ చెక్కీలు పావు కిలో ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 15,076 మంది గర్భిణులు, బాలింతలకు కిట్లు అందజేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

జనవరి 5న ఎస్సీ మోర్చా మహాసభ



మాట్లాడుతున్న ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దేవానంద్

విజయనగరం టౌన్: జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న ఎస్సీ మోర్చా మహాసభను విజయవంతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జి.దేవానంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, నాయకులు విజయలక్ష్మి, బొబ్బిలి శ్రీను, ఉప్పలపాటి వర్మ, కుసుమంచి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు ఖరారవ్వగానే పనులు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: టెండర్లు ఖరారవ్వగానే పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని మేయర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 అంశాలు పొందుపరచగా వాటిని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదించారు. అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్సై లోవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటోలు రోడ్డుపక్కన క్రమపద్ధతిలో నిలపాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించినా, అస్తవ్యస్తంగా ఆటోలు నిలిపినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.గణేష్‌బాబు తెలిపారు. ఐదో ఏపీఎస్పీ బెటాలియన్, చింతలవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అజెండా

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అజెండా అని, ఆ దిశగానే సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి ఎనిమిదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల ఎంతమేర లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. సంక్షేమం విషయంలో ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, జిల్లా కార్యదర్శి గంటా సతీష్, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, మైపాడ ప్రసాద్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, ఐడదీసి శ్రీనివాసరావు, పైల మురళి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా మార్ట్ ప్రారంభం



అర్బన్ మెప్మా మార్టును ప్రారంభించిన మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



కాలువలు, రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: డ్వాక్రా వస్తువులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఆదరించాల్సిన అవసరం అందరిపైనా ఉందని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా అర్బన్ మెప్మా మార్టును శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాళ్లలో ఏర్పాటు చేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, నగరంలో రెండు రోజుల పాటు డ్వాక్రా వస్తువులు, ఉత్పత్తులను ప్రదర్శనగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొన్ని వస్తువులు హోల్‌సేల్ ధరలకు తీసుకువచ్చి, రిటైల్‌గా విక్రయిస్తున్నారన్నారు. అలాగే కొన్ని సరుకులను డ్వాక్రా మహిళలు ఇంటి వద్దే తయారు చేసి విక్రయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగరంలోని 50వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో వివిధ అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. వైఎస్సార్‌నగర్‌లో రహదారులు, కాలువలు లేక పడుతున్న ఇబ్బందులను ప్రజలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి కోటీ 27 లక్షల రూపాయలు మంజూరు చేయడంతో కాలువలు, కల్వర్టు నిర్మాణ పనులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, తోనంగి జగన్నాథరెడ్డి, తదితరులతో కలిసి నాలుగు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కోలగట్ల శ్రావణి మీడియాతో మాట్లాడుతూ, వైఎస్సార్ నగర్ ఏర్పాటైనప్పటి నుంచి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేపట్టారన్నారు. రహదారులు, కల్వర్టుల పనులు త్వరితగతిన పూర్తి చేసి అవసరమైన సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తెలుగు వెలుగుల జ్యోతులు ప్రసరింపజేయాలి

● బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్



ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్, తదితరులు

విజయనగరం క్రైమ్: తెలుగు వెలుగుల జ్యోతులు ప్రతిచోటా ప్రసరింపజేయాలని బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్ కోరారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలలో జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న రెండో ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను విజయనగరం జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాషా ఔన్నత్యాన్ని విరాజింపజేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, సభ్యులు దాసరి పద్మ, రత్నాల బాలకృష్ణ, న్యాయవాదులు జి.రాంబాబు, ఎం.శ్రీనివాస్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమంలో వివిధ క్రీడాంశాల్లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులు పాల్గొనేలా కృషి చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో జరగనున్న కార్యక్రమాన్ని కొండకరకాం గ్రామంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అలాగే పోటీల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీవీ రామచంద్రరాజు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, హెచ్‌డీటీ కోటేశ్వర్లు, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

● డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్



విజయనగరం ఫోర్ట్: ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నెల్లిమర్ల: ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

విజయనగరం ఫోర్ట్: ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ కోరారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యాలపై శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్‌పై దాడి జరిగితే ఇక సామాన్యులకు ఏమి రక్షణ ఉంటుందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల బహిష్కరణ దుర్మార్గం

నెల్లిమర్ల: పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను బహిష్కరించడం దుర్మార్గమని వామపక్ష నేతలు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు అన్నారు. ఎంపీల బహిష్కరణకు నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మొయిద జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికార బీజేపీ ప్రతిపక్ష నేతల గొంతు నొక్కడానికి ఎంపీలను బహిష్కరించడం సరికాదన్నారు. బీజేపీ ఎంపీ మద్దతుతో ఇద్దరు యువకులు పార్లమెంట్‌లో పొగ బాంబులు వేస్తే సమాధానం చెప్పాల్సిన హోమ్ మినిస్టర్ ప్రతిపక్ష ఎంపీలను బహిష్కరించడం చేతకానితనమని ఎద్దేవా చేశారు. వెంటనే ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమాల వామపక్ష నేతలు చక్రధరరావు, తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి రాస్తారోకో

విజయనగరం పూల్‌బాగ్: పార్లమెంట్ ఉభయసభల్లో 141 మంది ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు కె. దయానంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్, మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం కునారిల్లుతోందని ఆరోపించారు. ఎంపీలపై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఆర్. శంకరరావు, జిల్లా కమిటీ సభ్యురాలు పి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

● విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



విజయనగరం రూరల్: రాకోడు పాఠశాలలో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు



చంద్రంపేటలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండల పరిధిలోని రాకోడు ప్రాథమికోన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతేడాది కంటే మరింత మెరుగైనవిధంగా ట్యాబ్‌లను రూపొందించి, అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పాటు ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య వంటి పథకాలతో విద్యారంగాన్ని బలోపేతానికి ముఖ్యమంత్రి జగనన్న కృషి చేస్తున్నారని కొనియాడారు.విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంఈఓ రామచంద్రరాజు మాట్లాడుతూ, మండలంలోని ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 307 ట్యాబ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో రాకోడు సర్పంచ్ పి.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో...

మండలంలోని చెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోద అప్పలకృష్ణ, బొంతు పైడినాయుడు, కోరాడ రవి, విద్యాకమిటీ చైర్మన్ పాండ్రంకి గోపాలరావు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

- హెచ్‌ఎం చేతుల మీదుగా..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం, చంద్రంపేట, సారిపల్లి పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా బోధన అందాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. డిజిటల్ బోధనతో విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



అజయ్‌ను అభినందిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సైలు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సనపల అజయ్‌కుమార్ ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో జోన్- 1 ఎస్సైగా ఎంపికయ్యాడు. దీంతో స్టేషన్ ఆవరణలో సీఐ బి. వెంకటరావు ఆధ్వర్యంలో సహచర సిబ్బంది అజయ్‌ను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, అజయ్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అజయ్ తండ్రి ఎక్సైజ్ శాఖలో హెచ్‌సీగా పనిచేసి రిటైరయ్యారు. కార్యక్రమంలో ఎస్సైలు అశోక్, గణేష్, మురళి, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

హేచరీ పునఃప్రారంభంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రాజా

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం గ్రామ సమీపంలో మూసివేసిన ఎపెక్స్ హేచరీ పునఃప్రారంభానికి యాజమాన్యానికి అవకాశం కల్పించాలని డీపీఓ శ్రీధర్‌రాజాను దిబ్బలపాలెం, చేపలకంచేరు గ్రామస్తులను విజ్ఞప్తి చేశారు. గతంలో హేచరీ యాజమాన్యం, గ్రామస్తుల మధ్య తలెత్తిన చిన్న చిన్న వివాదాల కారణంగా హేచరీని మూసివేశారు. మరలా హేచరీని ప్రారంభించడానికి అవకాశం కల్పించాలని కోరుతూ సంబంధిత యాజమాన్యం కలెక్టర్‌ను ఆశ్రయించారు. దీంతో కలెక్టర్ అదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రాజా, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హేచరీ సిబ్బంది, దిబ్బలపాలెం, చేపలకంచేరు గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ, గతంలో హేచరీ యాజమాన్యం గ్రామంలో గుడి నిర్మాణానికి నిధులు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు, గుడి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని డీపీఓ ద్వారా గ్రామస్తులు హేచరి సిబ్బందిని కోరారు. దీనిపై హేచరి యాజమాన్యం స్పందిస్తూ త్వరలోనే ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో డీపీఓ సమావేశాన్ని వచ్చే మంగళవారానికి వాయిదా వేశారు. సమావేశంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎఫ్‌డీఓ చాందిని, ఈఓపీఆర్‌డీ సురేష్, హేచరీ మేనేజర్ సీహెచ్ రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసంత విహార్‌లో అభివృద్ధి పనులు



వసంతవిహార్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: పట్టణంలోని 31వ డివిజన్ వసంత విహార్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, తదితరులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొద్దిసేపు స్థానికులతో ఆమె మాట్లాడారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వసంత విహార్ ప్రాంతంలో రహదారులు సరిగా లేవని స్థానికులు తెలియజేయడంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి రూ. 40 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నగరంలో ఒక వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే, మరోపక్క సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేయడంతో పాటు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు, ఫుడ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసి అన్నార్తులను ఆదుకోవడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడంతో ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ, కోలగట్ల హయాంలో తమ డివిజన్ ఎంతో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసన సభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామి మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ కృషి ఎనలేనిది..



నెల్లిమర్ల: గణిత దినోత్సవంలో విద్యార్థులు, డైట్ అధ్యాపకులు

● విమ్స్ డైరెక్టర్ వంగపండు శ్రీనివాస్

● ఘనంగా రామానుజన్ జయంతి



విజయనగరం టౌన్: విమ్స్ డైరెక్టర్ వంగపండు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

విజయనగరం టౌన్: గణితశాస్త్రం అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ చేసిన కృషి ఎనలేనిదని విమ్స్ డైరెక్టర్ వంగపండు శ్రీనివాస్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని (రామానుజన్ జయంతి) పురస్కరించుకుని మహారాజా స్వయంప్రతిపత్తి కళాశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామానుజన్ 12 ఏళ్లు ఉన్నప్పుడే త్రికోణమితిపై పట్టు సాధించి, రిమన్ సీరిస్, డైవరెజ్‌మెంట్ శ్రేణి సిద్ధాంతం, బీటా ఫంక్షన్, తదితర వాటిని రచించారన్నారు. నేటి యువత గణితశాస్త్రంలో షార్ట్‌కట్ మెలకువలపై పట్టు సాధించి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి సబ్బవరపు సూరిబాబు, అధ్యాపకులు ఉమాశంకర్, స్వామినాయుడు, లక్ష్మి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నివాళులు..

భోగాపురం: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని కొంగవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన కృషిని, కనుగొన్న సిద్ధాంతాలు ప్రతిభా పాటవాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆళ్ల వెంకటేశ్వరరావు, పబ్బిరెండి శివప్రసాద్, జి. మిన్నారావు పాల్గొన్నారు.



భోగాపురం: కొంగవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థిని

డైట్‌లో..

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు. మాణిక్యంనాయుడు, అధ్యాపకులు కె. రామకృష్ణారావు, జీవీఎస్ఎస్ నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వరరావు, గణితశాస్త్ర అధ్యాపకుడు కె. సూర్యారావు, వీవీజీఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.